ఉమ్రాకు బయలుదేరిన యాత్రికులు



శంషాబాద్: మొహర్రం నెల సందర్భంగా ఉమ్రా యాత్రికుల తొలి బృందం బుధవారం బయలుదేరింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాలకు చెందిన మొత్తం 60 మంది యాత్రికులు అల్‌మిజాన్ సంస్థ పర్యవేక్షణలో శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఉమ్రాకు వెళ్లారు. ఈ సందర్భంగా వారికి కుటుంబసభ్యులు, బంధువులు, మిత్రులు శుభాకాంక్షలు తెలిపారు. యాత్రను దిగ్విజయంగా పూర్తి చేసుకుని రావాలని ఆకాంక్షించారు. యాత్రను సంస్థ నిర్వాహకుడు ఫయాజ్ అలీ పర్యవేక్షిస్తున్నారు.

పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన



మాట్లాడుతున్న మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర

బండ్లగూడ: పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహిస్తూ వారిని జాగృతం చేస్తున్నామని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర అన్నారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా 17వ డివిజన్‌లోని ప్రశాంత్‌నగర్ కాలనీలో తడి, పొడి, హానికర చెత్తపై కాలనీవాసులకు బుధవారం ఉదయం అవగాహన కల్పించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ క్లీనింగ్ ప్రక్రియను పరిశీలించి పలు సలహాలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, ఏఈఈ వి.రాజ్ కుమార్, జి.వెంకట్‌రెడ్డి, బిల్ కలెక్టర్లు, శానిటరీ జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల పరిశీలన

బండ్లగూడ: కార్పొరేషన్ పరిధిలోని 18వ డివిజన్ అరుణోదయ కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ నాయకుడు గోకరి సురేష్‌గౌడ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో పూర్తి చేయాలని గుత్తేదారులకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

సర్కారు బడికి మళ్లీ కళ

శంషాబాద్ రూరల్: మండలంలోని గచ్చుబాయితండా ప్రాథమిక పాఠశాల విద్యార్థులంతా సమీపంలో గల ముచ్చింతల్‌లోని బడికి వెళ్లారు. దీంతో ఈ పాఠశాలలో విద్యార్థుల్లేక ఉపాధ్యాయుడు ఖాళీగా కూర్చునే పరిస్థితి నెలకొంది. అయితే కొన్ని రోజులుగా స్థానికులు విద్యార్థులను మళ్లీ ఇక్కడికే పంపిస్తున్నారు. బుధవారం 12 మంది విద్యార్థులు పాఠశాలకు హాజరుకావడంతో బడికి మళ్లీ కళ వచ్చినట్లయ్యింది. గతంలో ఇక్కడ 30 మంది విద్యార్థులు ఉండేవారు.

స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు మహనీయుల పేరు పెట్టాలి

రాజేంద్రనగర్: కాటేదాన్ ప్రాంతంలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు మహనీయులైన డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, జ్యోతీరావు పూలే పేరు పెట్టాలని జయంతి ఉత్సవాల కమిటీ మాజీ చైర్మన్ మంత్రి చంద్రశేఖర్ కోరారు. రాజేంద్రనగర్ అంబేడ్కర్ చౌరస్తాలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పంబల్ల రాజు, పత్యార నరసింహ, గొడుగు సంజీవ, పత్యార రాజు, షాబాద్ రాములు, మల్కారం రాములు, కొత్తపల్లి సంతోష్ కుమార్, శివ కుమార్, పెండ్యాల జంగయ్య, పెరుమళ్ల రవి తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో చండీహోమం



బండ్లగూడ: అమావాస్యను పురస్కరించుకుని గంధంగూడ వాసవీ కన్యకా పరమేశ్వరాలయంలో 13 అధ్యాయలతో వేదపండితుల మంత్రోచ్ఛరణలతో బుధవారం చండీ హోమం నిర్వహించారు. భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు, రేణుకా ఎల్లమ్మ ఆలయ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో సమస్యల తిష్ట..!

కనీస వసతులు కరువు
సరిపడా లేని తరగతి గదులు

- మరుగుదొడ్లు లేక విద్యార్థుల అవస్థలు
- అమ్మ ఆదర్శ పనుల్లో తీవ్ర జాప్యం
- పట్టించుకోని అధికారులు

శంషాబాద్ రూరల్: సర్కారు బడుల్లో సమస్యలు తిష్ట వేశాయి. కనీస వసతుల్లేక విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. 'అమ్మ ఆదర్శ పాఠశాల' కార్యక్రమంలో భాగంగా స్కూళ్ల పునఃప్రారంభం నాటికే వసతుల కల్పించాల్సి ఉండగా ఇంకా పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. ఇవి కూడా ఎప్పుడూ పూర్తవుతాయో తెలియని పరిస్థితి. పలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల సౌకర్యం లేదు. అలాగే మధ్యాహ్న భోజనం వండేందుకు గదులు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో నిర్వాహకులు ఇళ్ల వద్దే వంట చేసి తెస్తున్నారు. మరికొన్ని పాఠశాలల్లో సరిపడా తరగతి గదులు లేక ఒకే గదిలో రెండు తరగతుల విద్యార్థులకు బోధన చేస్తున్నారు.

నర్కూడలో..

నర్కూడ ప్రాథమిక పాఠశాలలో 150 మంది విద్యార్థులున్నారు. స్కూల్ భవనం వెనక వైపు ఉన్న మరుగుదొడ్ల మరమ్మతులు మధ్యలోనే నిలిపివేశారు. రెండు చోట్ల మరుగుదొడ్లు ఉన్నప్పటికీ అందుబాటులో లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. దాతలు సమకూర్చిన మొబైల్ టాయిలెట్లను తరగతి గదులు ముందు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వీటిని వినియోగిస్తుండగా.. ఓవర్ హెడ్ ట్యాంకు ద్వారా నీటి సరఫరా లేదు. వీటి కింది భాగంలో కాంక్రీట్ లేకపోవడంతో మట్టిలో కూరుకుపోతున్నాయి.



రాయన్నగూడ పాఠశాల గేటు ఎదుట ఉన్న బురదగుంట

రాయన్నగూడలో..

రాయన్నగూడ ప్రాథమిక పాఠశాలలో 12 మంది విద్యార్థులకు ఒకే ఉపాధ్యాయుడు, ఒక తరగతి గది ఉంది. దాతలు సమకూర్చిన మొబైల్ టాయిలెట్లకు నీటి సరఫరా లేక నిరుపయోగంగా మారాయి. ఇదిలాఉంటే పాఠశాల వెనక భాగంలోని ఓవర్ హెడ్ నీటి ట్యాంకు నుంచి ఓవర్‌ఫ్లో అయిన నీరు పాఠశాల ఎదుట చేరి మురుగుగుంటను తలపిస్తున్నది. పాఠశాల ఆవరణలోనే అంగన్‌వాడీ కేంద్రం ఉండగా.. విద్యార్థులతో పాటు చిన్నారులు లోనికి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్కూల్‌కు ఆనుకుని ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండడంతో అందులోని క్రిమీకీటకాలు పాఠశాలలోకి వస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



రామంజాపూర్‌లో శిథిలావస్థకు చేరిన వంట గది



నర్కూడలో మరమ్మతులు పూర్తికాని మరుగుదొడ్లు



రామంజాపూర్‌తండాలో మరుగుదొడ్ల దుస్థితి

రామంజాపూర్‌లో..

రామంజాపూర్ జడ్పీ పాఠశాలలో 108 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ వంట గది శిథిలావస్థకు చేరగా నిర్వాహకులు మధ్యాహ్న భోజనం ఇంటి వద్దే వండి తెస్తున్నారు. పాఠశాలను ఐదేళ్ల కిందట అప్‌గ్రేడ్ చేసినా అందుకు తగ్గట్లు ఉపాధ్యాయుల నియామకం చేపట్టలేదు. మరో వైపు తరగతి గదుల కొరత కారణంగా రెండేసి తరగతి విద్యార్థులను ఒకే గదిలో కూర్చోబెట్టి బోధిస్తున్నారు. ఇక్కడ ల్యాబ్ గది పనులు కొనసాగుతున్నాయి.

రామంజాపూర్‌తండాలో..

ఈ పాఠశాలలో 11 మంది విద్యార్థులుండగా.. ఒకటే తరగతి గది అందుబాటులో ఉంది. వంట గది లేకపోగా.. మరుగుదొడ్ల నిరుపయోగంగా మారాయి. వీటి మరమ్మతులు మధ్యలోనే నిలిపివేశారు.

బోటిగూడలో..

ఈ బడిలో 18 మంది విద్యార్థులున్నారు. గతేడాది ముగ్గురు మాత్రమే ఉండగా.. ఈయేడు కొత్తగా 15 మంది బడిలో చేరారు. స్థానికుల సహాయంతో భవనానికి రంగులు వేశారు. మరుగుదొడ్డి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. మొబైల్ టాయిలెట్‌కు ఓవర్‌హెడ్ ట్యాంకు ద్వారా నీటి సరఫరా జరగడం లేదు. ఇదిలాఉంటే పాఠశాల ఆవరణలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. చెట్ల కొమ్మలు అల్లుకుని గాలి వీచినప్పుడు తీగల నుంచి మంటలు చెలరేగుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పాఠశాలల్లో వసతులు కల్పించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

నేటి నుంచి కోట మైసమ్మ ఆలయంలో వారాహి నవరాత్రులు



రాజేంద్రనగర్: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని కోట మైసమ్మ తల్లి ఆలయంలో ఈనెల 26 నుంచి వారాహి నవరాత్రులు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు ఉదయం 4.30 గంటలకు అమ్మవారికి పంచామృత అభిషేకం నిర్వహిస్తామని బుద్వేల్ భక్త మహాశ్రీయులు పాల్గొని అమ్మవారి అనుగ్రహానికి పాత్రులు కావాలని కోరారు. అమ్మవారికి 8 గంటలకు ఏకాదశి హారతి ఉంటుందని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

పగలే వెలుగు..!



ఎంఎం పహడీలో పగలే వెలుగుతున్న హైమాస్ట్ లైట్లు

శాస్త్రిపురం : రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని సులేమాన్‌నగర్, శాస్త్రిపురం డివిజన్లలోని పలు ప్రాంతాల్లో పగలే వెలుగులు విరజిమ్ముతున్నాయి. రాత్రి వేళలో విద్యుద్దీపాలు ఆన్ చేసి ఉదయం ఆఫ్ చేయాల్సిన సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో నిరంతరంగా వెలుగుతూనే ఉంటున్నాయని స్థానికులు వాపోతున్నారు. విద్యుత్‌ను ఆదా చేయాలని సూచించే అధికారులే తమ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా విద్యుత్ వృథా అవుతున్నా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని కాలనీల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ దీపాల నిర్వాహణను సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని రాజేంద్రనగర్ సర్కిల్ ప్రజలు కోరుతున్నారు.

దోమల నివారణకు 'వన్‌డే వార్ డే'



మూసీ ప్రాంతంలో పర్యటిస్తున్న ఎంటమాలజీ సీనియర్ అధికారి నామాల శ్రీనివాస్

అత్తాపూర్: దోమల నివారణకు జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. ప్రతి వారం ప్రతి డివిజన్‌లోని అన్ని ప్రాంతాలను కవర్ చేస్తూ స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఎంటమాలజీ సీనియర్ అధికారి నామాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఓ బృందం అత్తాపూర్ డివిజన్ మూసీ తీర ప్రాంతంలో బుధవారం పర్యటించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దోమల బెడద కొంచెం తగ్గినా వర్షాలు పడి ఆగిపోవడం వల్ల దోమల లార్వా వృద్ధి చెంది సమస్య తీవ్రమైందన్నారు. జోనల్ కమిషనర్ వెంకన్న ఆదేశాల మేరకు వారానికి ఒక రోజు ప్రతి డివిజన్‌లో ఒక ప్రాంతాన్ని ఎంచుకుని యుద్ధ ప్రాతిపదికన దోమల నివారణ కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. సోమ, మంగళవారం రాజేంద్రనగర్ డివిజన్‌లో, బుధవారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో, గురువారం శాస్త్రీపురం డివిజన్‌లో, శుక్రవారం అత్తాపూర్‌లో, శనివారం సులేమాన్‌నగర్‌లో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని వెల్లడించారు. అత్తాపూర్ డివిజన్ ప్రాంతంలోని మూసీలో గుర్రపు డెక్క తొలగింపు దాదాపు పూర్తయిందని తెలిపారు. ఆయన వెంట అసిస్టెంట్ ఎంటమాలజీ అధికారి ఉదయ్, మ్యాడం మధు తదితరులు పాల్గొన్నారు.

మొహర్రం పండుగకు ఇబ్బందుల్లేకుండా చూడాలి



రాజేంద్రనగర్ ఏసీపీ శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇస్తున్న సయ్యద్ రిజ్వాన్ హుస్సేన్

అత్తాపూర్: మొహర్రం పండుగకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చూడాలని కోరుతూ సయ్యద్ రిజ్వాన్ హుస్సేన్ ప్రతినిధి బృందం రాజేంద్రనగర్ ఏసీపీ శ్రీనివాస్, అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ కె.నాగేశ్వరరావుకు బుధవారం వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 68 రోజుల పాటు జరిగే కార్యక్రమాల్లో ఎలాంటి గొడవలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరినట్లు వారు తెలిపారు.

ఆలయంలో పూజలు

మైలార్‌దేవ్‌పల్లి: బాబుల్‌రెడ్డినగర్ పోచమ్మ ఆలయంలో బుధవారం అమావాస్య పూజలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్, కిష్టప్ప, లక్ష్మణ్, వెంకటేశ్, ఆవుల కృష్ణ, శంకర్, మల్లేశ్, శేఖర్, నోముల శ్యాంయాదవ్, శ్రీశైలం, ఉదయ్‌కుమార్, రఘు, నరేశ్, లింగం, సురేశ్, డి.అశోక్, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.



అన్నదానంలో భక్తులు

రాజేంద్రనగర్ డివిజన్ నాయీ బ్రాహ్మణ నూతన కమిటీ



రాజేంద్రనగర్: హైదర్‌గూడ ఏనుగుల మైసమ్మ టెంపుల్ రాజేంద్రనగర్ డివిజన్ నాయీ బ్రాహ్మణ నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. రాజేంద్రనగర్ దుకాణం యజమానులు నాయీ బ్రాహ్మణ రాష్ట్ర అధ్యక్షుడు పాలవ్య శ్రీనివాస్‌తో పాటు నాయకులు పాల్గొన్నారు. రాజేంద్రనగర్ అధ్యక్షుడిగా రాఘవేందర్ నాయీని ఏకగ్రీవంగా ఎన్నుకోగా నాయీ యూత్ అధ్యక్షుడిగా గోపాల్నాయి నవీన్‌ను కూడా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్ నాయీ, మహేశ్ నాయీ, కోశాధికారిగా వెంకట్ నాయీ, ఉదయ్ కుమార్, సలహాదారులుగా సీనియర్ రాజన్న నాయీ, రమేశ్ నాయీ, జాంగీర్, సురేశ్ నాయీ దాదాపు 100 మందికి పైగా మీటింగ్‌కు వచ్చిన నాయీ బ్రాహ్మణ కమిటీ ఎనుకున్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

శంషాబాద్ రూరల్: తాగిన మైకంలో ఓ మహిళ తన ఒంటిపై పెట్రోలు పోసుకుని ఆత్మహత్యకు పాల్పడగా.. చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మున్సిపాలిటీ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఇందిరానగర్ దొడ్డికి చెందిన బోడంపాటి పార్వతమ్మ (47)కు కల్లు, మద్యం తాగే అలవాటు ఉంది. ఒక్కోసారి మద్యం మత్తులో ఇంటి వద్ద అరుస్తుండేది. ఈనెల 19న రాత్రి వేళ తాగిన మైకంలో ఇంటి వద్ద అరుస్తుండగా.. కుటుంబ సభ్యులు ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకున్నారు. కొద్దిసేపటికే ఆమె ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలుడి మృతదేహం వెలికితీత



ప్రిన్స్‌కుమార్ మృతదేహం

మైలార్‌దేవ్‌పల్లి: బావిలో పడి మృతి చెందిన బాలుడి మృతదేహాన్ని పోలీసులు బుధవారం వెలికితీశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన చంద్రకుమార్ భార్య, ముగ్గురు పిల్లలతో వచ్చి రాజీవ్ గృహకల్ప పింక్ భవనంలో ఉంటున్నారు. వీరి కుమారుడు ప్రిన్స్‌కుమార్ (5) మంగళవారం మధ్యాహ్నం స్నేహితుడు రాజ్‌కుమార్‌తో కలిసి ఆడుకుంటూ వ్యవసాయ బావిలో పడిపోయాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని హైడ్రా డీఆర్‌ఎఫ్, అగ్నిమాపక శాఖ సిబ్బందితో కలిసి బాలుడి మృతదేహం కోసం గాలించారు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో మృతదేహం లభ్యమైంది. పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

నైపుణ్యాలు పెంచడమే లక్ష్యం



సౌకర్యాలపై ఆరా తీస్తున్న ఎంఈఓ వెంకటయ్య

రాయదుర్గం: పాఠశాల స్థాయిలోనే చదువుతో పాటు నైపుణ్యాలను పెంచడమే లక్ష్యమని శేరిలింగంపల్లి మండల విద్యాధికారి వెంకటయ్య సూచించారు. గచ్చిబౌలి డివిజన్ రాయదుర్గంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఒకేషనల్ విద్యలో భాగంగా హాస్పిటాలిటీ అండ్ టూరిజం, ఏఐ ల్యాబ్, లైబ్రేరీను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకేషనల్ కోర్సుల తరహా విద్యార్థులకు ఆయా రంగాలలో నైపుణ్యాలను నేర్పించడం ద్వారా పాఠశాల స్థాయిలో నైపుణ్యాలను తయారు చేయడానికి అవకాశం ఏర్పడడం ఆనందంగా ఉందన్నారు. పర్యాటక, అతిథ్యరంగాలు, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ రంగాలలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రధానోపాధ్యాయుడు ఎస్‌కే తాజ్‌బాబు మాట్లాడుతూ.. ఒకేరోజు మూడు ప్రధాన వాటిని ప్రారంభించామన్నారు. అందులో ఒకేషనల్ కోర్సుల కోసం పర్యాటక, ఆతిథ్య రంగాల్లో ఏఐల్యాబ్‌తోపాటు ప్రత్యేకంగా లైబ్రరీని ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ విద్యాకమిటీ చైర్మన్ కృష్ణగౌడ్, సభ్యులు కృష్ణ యాదవ్, నరేందర్, ఉపాధ్యాయులు స్వర్ణలత, సుదీరా, టీవీమమత, దేవమణి, శ్రీనివాస్, సునీత, పావని, శాంత పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న రాజభూపాల్‌గౌడ్ తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు పంతంగి రాజభూపాల్‌గౌడ్, రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. 'వికసిత్ భారత్ అమృతకాలం'లో భాగంగా పార్టీ ఆదేశాల మేరకు ప్రేమావతిపేట్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్–1 అధ్యక్షుడు గోద పాండుయాదవ్ ఆధ్వర్యంలో బుధవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వారు హాజరై మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ పీ మల్లేశ్‌యాదవ్, జిల్లా సీనియర్ నాయకులు శ్రీధర్, కొమురయ్య, చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి, జోగి రవి, అడికే రాజు, బొమ్మరాజు నర్సింహ, వెంకటరమణగుప్తా, సంతుగౌడ్, విజయ్‌కుమార్, సురేశ్‌ముదిరాజ్, సుధాకర్, నరోత్తంరెడ్డి, రఘు ముదిరాజ్, భవానీదాస్, ఎడ్లకాడి రవి, రామారావు, కిరణ్, యాదగిరి, వినయ్, నర్సింహ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నివారణకు చర్యలు

ట్రాఫిక్ జాయింట్ సీపీ గజరావు భూపతి



పీరం చెరువు వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి యూటర్న్‌ను మూసి వేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

బండ్లగూడ: పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ట్రాఫిక్ రద్దీ నెలకొనకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ట్రాఫిక్ జాయింట్ సీపీ గజరావు భూపతి పేర్కొన్నారు. అప్పా చౌరస్తాలోని బ్రాడ్‌వే హోటల్ నుంచి చేవెళ్ల వెళ్లే రహదారి రాఘవేంద్ర హోటల్ వరకు ట్రాఫిక్ సమస్య జటిలంగా మారుతుండడంతో ఈ ప్రాంతంలో ఫ్లై ఓవర్, లేదా అండర్ వే నిర్మించే విషయమై చర్యలు చేపడుతున్నారు. ఈ మేరకు డీసీపీ సాయి మనోహర్, ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డి, నార్సింగి ట్రాఫిక్ సీఐ నిరంజన్‌రెడ్డి, ఆర్‌ఐ ప్రదీప్‌కుమార్‌తో కలిసి హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిని బుధవారం పరిశీలించారు. అప్పా చౌరస్తా నుంచి టిప్పుఖాన్ బ్రిడ్జి వరకు పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వర్షం కురిసినప్పుడల్లా జీఆర్‌కే గార్డెన్ వద్ద నీరు నిలిచి ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. ఈ విషయమై నీరు నిల్వ ఉండకుండా చేపట్టే పనులపై సమీక్షించారు. అలాగే పీరం చెరువు కమాన్ వద్ద యూటర్న్ తీసుకునేందుకు వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అరగంటలో వెళ్లాల్సిన గమ్యస్థానాలకు గంటర్నర పాటు ట్రాఫిక్‌లోనే ఉండి నానా అవస్థలకు గురవుతున్నారు. పక్కనే వైన్స్ ఉండడంతో సాయంత్రం సమస్య మరింత జటిలంగా మారుతోంది. దీంతో ఆర్‌ఐ ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ యూటర్న్‌ను మూసి వేశారు. ట్రయల్ రన్‌గా బారీకేడ్లు ఏర్పాటు చేసి వాహనాలను ముందు ఉన్న యూటర్న్ నుంచి వెళ్లేలా చర్యలు తీసుకున్నారు.

మాదక ద్రవ్యాల వినియోగంతో జీవితం నాశనం



అవగాహన సదస్సులో అధికారులు, విద్యార్థులు

మణికొండ: మాదక ద్రవ్యాల వినియోగంతో జీవితం నాశానం అవుతుందని తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో సీఐలు రమేశ్‌రెడ్డి, విజయభాస్కర్ రెడ్డి అన్నారు. గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ) కళాశాలలో కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. వారు హాజరై మాట్లాడుతూ.. డ్రగ్స్ వాడకం మెదడు, కండరాలు, నరాలపై తీవ్ర ప్రభావం చూపి ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తాయన్నారు. కొన్ని రోజుల్లోనే శరీర భాగాలు సరిగా పనిచేయకపోవడంతో పాటు అనే అనారోగ్య సమస్యలు చుట్టుముట్టి జీవితం అర్ధాంతరంగా ముగించే పరిస్థితి వస్తుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. సరదాగా మొదలయ్యే డ్రగ్స్ వ్యసనం చివరకు ప్రాణాల మీదకు తెస్తుందన్నారు. కార్యక్రమంలో నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి, డాక్టర్ వెంకట్ రెడ్డి, డాక్టర్ వి.హరిలీలా, బి. శశిధర్‌రెడ్డితో పాటు విద్యార్థులు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ జి.బాల్‌రెడ్డి పాల్గొన్నారు.